**కథ**

# గతి తప్పిన మనస్సు

భమిడిపాటి సోమయాజి

**మనిషి కొన్నిసార్లు తప్పులు చేస్తాడు. వాటిల్లో కొన్ని దిద్దుకోలేని తప్పులు వుంటాయి. తను చేసింది తప్పని తెలుసుకున్నా ఉపయోగం వుండదు. ఎందుకంటే అటువంటి తప్పు మళ్లీ చేసే అవకాశం లేక! అవకాశం వుండకపోవడమే కాదు, కొన్నిసార్లు జీవన వ్యవధి కూడా వుండదు. అసలు ఈ తప్పులు చేసి, అవి తప్పని తెలుసుకున్న మనిషికి వచ్చేజన్మలో ఇంతమట్టుకి పూర్వజ్ఞానం భగవంతుడు ప్రసాదించి వుంటే, మరుజన్మలో ఇవే తప్పులు చేయకుండా వుండడానికి మనిషికి అవకాశం వుండేది కదా!**

కాశీ విశ్వేశ్వర్రుని గుడిలో ఒంటరిగా కూర్చున్న కాశీనాథుడు తన గతం గురించి ఆలోచిస్తూ కుమిలిపోతున్నాడు. గతం, ఒలికిపోయిన పాలు లాంటిది. ఒకసారి పాలు ఒలికితే అవి నిరుపయోగం అయిపోతాయి. అవి కష్టపడి ఎత్తి ఒక గిన్నెలో పోయనూలేం, ఒకవేళ అలా వేసినా అవి కాచేటప్పుడు విరిగిపోయి నిష్ప్రయోజనం అయిపోతాయి. భవిష్యత్ వర్తమానాలు జాగ్రత్తగా గడిపే విషయంలో శ్రద్ధ తీసుకుంటే మంచిది. ఇదే విషయం ఆ గుళ్లో రోజూ కలిసే ఒకాయన చెపుతూనే వుంటాడు కాశీనాథునికి. ఈరోజు కూడా యధాప్రకారం 'గతం గురించి ఆలోచించి ప్రయోజనం లేదని' చెపుతూన్న సమయంలో ఎవరో ఒక చిన్నపిల్లాడు 'ఆ తాతగెడ్డం బాగుంది' అని వాడి తల్లితో చెపుతున్నాడు. ఇంకేముంది మళ్లీ కాశీనాథుని మనస్సు గతంలోకి వెళ్లిపోయింది.

★ ★ ★

కాశీనాథుడికి ఒక్కడే కొడుకు. పేరు సంతాన గోపాలస్వామి. సంతాన గోపాలస్వామికి పెళ్లై పదేళ్లు గడిచినా సంతానం కలగలేదు. కాశీనాథుడికి మనవడ్ని ఎత్తుకోవాలని అమితమైన కోరిక. ఎవరైనా తనతోటి మిత్రుడు 'ఈవేళ మా మనవడు మంచి ఖరీదైన వస్తువు పాడుచేశాడు. వెయ్యి రూపాయలు గోవిందా అయిపోయాయి'' అంటే, ''పోన్లేవయ్యా డబ్బుపోతే పోయింది. అసలు ఇంట్లో మనవడు హుషారుగా అల్లరి చేస్తూ ఏవైనా పాడుచేసినా అందమే'' అనేవాడు కాశీనాథుడు.

''సర్లే నీకేమయ్యా చెపుతావు. అదే మీ ఇంట్లో ఏదైనా ఖరీదైన వస్తువు పాడయిపోతే తెలుస్తుంది నీకు'' అని వాళ్లంటే కాశీనాథుని సమాధానం, ''చూద్దురుగాని! నాకు మనవడు పుట్టి వాడేం తగలేసినా నేనేమీ బాధపడను.''

''అదీ చూద్దాం!'' అనేవారు వాళ్లు.

కాలక్రమేణా కాశీనాథుని కొడుక్కి పిల్లలు పుట్టకపోవడంతో, అతన్ని ఆట పట్టించడానికి, ''ఏమయ్యా! మీ సంతాన గోపాలస్వామికి ఏమైనా సంతానమా!'' అని అడిగేవారు.

వాళ్లు వేళాకోళం చేసినా కాశీనాథుడు తన మనస్సులో బాధపడేవాడు. కోడలు వలన తన వంశాభివృద్ధి కావటంలేదన్న బాధతో కోడలంటే ఒకవిధమైన కోపం కలిగేది. ఎప్పుడైనా కోడలు కనబడకపోతే ''ఏదీ ఈ మహాతల్లి'' అని భార్యనడిగేవాడు.

''ఇప్పుడే నీళ్లు పోసుకోవడానికి బాత్‌రూమ్‌లోకి వెళ్లిందంటే ''అందరూ నీళ్లాడతారు. ఈవిడ మాత్రం నీళ్లు పోసుకుంటుంది!'' అని చికాకు పడేవాడు.

''పాపం ఆ పిల్లేంచేస్తుందండీ! సంతానమనేది దేవుడు ప్రసాదించాలి'' అని భార్య అంటే, ''నీకేం తెలుసు! నువ్వింట్లో కూర్చుంటావు. నేను మగాడ్ని కనుక బయటికి వెళ్లక తప్పదు. వెళ్లినప్పుడు మా మిత్రులు మీ సంతాన గోపాలస్వామికి ఏమైనా సంతానమా అని వెటకారమాడినప్పుడు వెంటనే ఇంటికి రాకా తప్పదు'' అనేవాడు.

ఇలా రోజులూ నెలలూ ఏళ్లూ గడుస్తూన్న కొద్దీ కాశీనాథుని సహనం నశిస్తోంది. ఒకరోజు తన భార్యతో అన్నాడు. ''ఈ పిల్లకి విడాకులు ఇప్పించి మన గోపాలంగాడికి ఇంకో పెళ్లి చేస్తే మంచిది. నాకు షష్టిపూర్తి కూడా అయిపోయింది. ఇక పోను పోను మనవడ్ని ఎత్తుకునే ఓపిక కూడా వుండదు. ఈ విషయం నువ్వొకసారి అబ్బాయితో చెప్పు.''

''సాటి ఆడదానిగా నేనిటువంటి పన్లు చేయించలేను.''

''సంతోషం! సాటి ఆడదానిగా చేయించలేకపోతే నా సహధర్మచారిణిగా చేయించు.''

''అంటే మీరు చేసేది ధర్మమా?''

''మనవడ్ని ఎత్తుకోవాలనుకోవడం ధర్మం కాదా!''

వైద్యుల్ని, న్యాయవాదుల్ని ఆశ్రయించాడు. ఇలా కొంతకాలం గడిచింది. ఆఖరికి ఎలా అయితేనేం కోడలికి విడాకులిప్పించడం, రెండో కోడల్ని తెచ్చుకోవడం జరిగాయి. రెండో కోడలు కడుపు పండింది! కాశీనాథుని కోరిక ఫలించి మనవడ్ని ఎత్తుకోవడం మొదలుపెట్టాడు. ఎత్తుకోవడం మొదలుపెట్టిన కొంతకాలానికి, తన ఎత్తుగడలతో పెద్దకోడలికి విడాకులు ఇప్పించిన దుష్ఫలితం వలన కాబోలు, ఒకసారి తన మనవడ్ని ఎత్తుకున్న సమయంలో కాలుజారి పడ్డాడు. మనవడికి పెద్ద దెబ్బే తగిలింది. ఈ పెద్ద దెబ్బ వలన తాతకి ఇంకా పెద్ద దెబ్బ తగిలింది. మనవడ్ని ఎక్కువ ఎత్తుకోనీయకుండా చేసేది తన కోడలు. అసలు మనవడ్ని తాత దగ్గరకి పంపేది కాదు.

కొడుకు కూడా ''నీకు ఓపిక లేనప్పుడు వాడ్ని ఎందుకు ఎత్తుకోవడం. లేక లేక కలిగిన పిల్లాడు వాడు'' అనేవాడు.

''సర్లేరా ఇక ఎత్తుకోన్లే'' అని తను కూర్చున్నప్పుడు మాత్రం మనవడ్ని ఒళ్లో కూర్చోపెట్టుకునేవాడు. మధ్యమధ్యలో ముద్దాడేవాడు.


ఆ ముద్దు పెట్టుకోవడం చూసిన కోడలు మండిపడేది. ''ఏమిటో! ప్రేముంటే ముద్దు పెట్టుకోవాలా! వాడి బుగ్గలు చూడండి ఎలా కందిపోయాయో! పైగా ఇన్‌ఫెక్షన్స్ వస్తాయి'' అంటూ తన కొడుకుని తీసుకుపోయి తాత తన్మయత్వం వదలకొట్టేది.

ఒకసారి కాశీనాథుడు అరుగు మీద కూర్చుని పేపరు చదువుతూన్నప్పుడు తవ మనవడు కూడా పక్కనే ఆడుకుంటున్నాడు. ఎవరో వచ్చి ఫలానా వాళ్లిల్లెక్కడ అని అడిగితే, కాశీనాథుడు పేపర్ చదువుకుంటూనే అతనికి సమాధానం చెప్పాడు. ఇంతలో కోడలు లోపల్నుంచి వచ్చి ''అయ్యో వీడి మెడలో వేసిన గొలుసేదీ'' అంటూ గట్టిగా అరిచింది.

''మీరేం చేస్తున్నారు? వాడ్ని చూడక్కర్లేదా!

వట్టప్పుడు పిల్లాడ్ని కౌగిలించుకొని వదలరు. పుట్టినరోజు కదా అని ఆ గొలుసు వేశాను. మా పుట్టింటివాళ్లు ముచ్చటపడి బారసాలనాడు చేయించిన గొలుసది'' అని పెద్ద రాద్ధాంతం చేసింది.

పాపం కాశీనాథుడికి ఏం చెప్పాలో తెలీలేదు. ఇందాకా 'ఫలానా వారిల్లెక్కడ' అన్నవాడే తీసుకుపోయి వుంటాడు. ఆ విషయం చెపుతే ఇంకా గొడవవుతుంది. ఆ రాత్రి కాశీనాథుడికి కంటిమీద కునుకు లేదు. అసలు మనవడు లేనప్పుడే ఒకవిధంగా ఇంత కష్టపడేవాడ్ని కాదేమోనన్న ఆలోచన వచ్చింది. పెద్దకోడలికి ఇంకొన్ని రోజులకి సంతానం కలుగుతుందేమో వేచి చూస్తే బాగుండేదేమో, అనవసరంగా ఆ పిల్ల ఉసురు పోసుకున్నానేమో అని బాధపడ్డాడు.



★ ★ ★

తర్వాత తర్వాత తన మనవడు దగ్గరకొచ్చేవాడు కాదు. ఒకసారి కోడలు పుట్టింటికి వెళ్లినప్పుడు మనవడు కల్లోకి వచ్చాడు కాశీనాథుడికి. ''తాతా! పెద్ద గాలి పటం, పెద్ద బుడగ కావాలి'' అన్నట్లు కల. అన్నింటికి వీడు 'పెద్ద' అంటాడు. పెద్దయితే వీడు పెద్ద మనస్సు గలవాడవుతాడు'' అని చెప్పాడు తన భార్యతో.

కోడలు పుట్టింటినుంచి వచ్చిన తర్వాత మనవడ్ని పిలిచి, ''బజార్‌కి తీసుకెళ్లి పెద్ద గాలి పటం, పెద్ద బుడగ కొనిస్తాను!'' రమ్మంటే, ''నేను రాను పో-పెద్దమ్మ నీదగ్గరికి వెళ్లద్దంది'' అన్నాడు వాడు.

''పెద్దమ్మ ఎవ్రరా!'' అంటే తన కోడలికేసి చూపించాడు.

''ఓహో! అమ్మకి ముందు 'పెద్ద' చేర్చావా నాయనా!'' అనుకుంటూ ''అది పెద్దమ్మ కాదురా! జ్యేష్టా దేవత!'' అన్నాడు మెల్లిగా.

ఆ రాత్రి కాశీనాథుడికి నిద్రపట్టలేదు. మనస్సు, మనవడ్ని తన దరి చేరనీయటంలేదని బాధపడింది. ''పెద్దకోడలు నిజంగా లక్ష్మీదేవే! ఆ పిల్లని వదలకొట్టుకుని ఆ లక్ష్మి స్థానంలో ఒక జ్యేష్టా దేవతని నెలకొల్పి మనశ్శాంతి పోగొట్టుకున్నాను. ఆ పిల్లకి చేసిన అన్యాయం వలన మనవడు వున్నా ఆ మమతానురాగాలు అనుభవించలేకపోతున్నాను. అందుకే కాబోలు మా మామ్మ అస్తమానూ, ఆడదాని ఉసురు పోసుకున్నవాడు ఎవడూ సుఖపడడు అనేది'' అనుకుంటూ తెల్లారకట్ల నాలుగింటికి కూడా నిద్రపోదామని ప్రయత్నం చేశాడు. కాని, నిద్రపట్టలేదు! తెల్లారింది కాని, పాపపంకిలంతో నిండిన మనస్సులోని చీకటి వలన ఆ తెల్లవారిన వెలుగు కన్పించలేదు.

ఇల్లు శాశ్వతంగా వదిలేసి, మంగళకరుడైన శివుని సాన్నిధ్యంలో శేషజీవితం ప్రశాంతంగా గడుపుదామని కాశీ వచ్చేశాడు కాశీనాథుడు. తన ఊరు అయితే వదిలేశాడు కాని తన పాపపంకిలమైన మనస్సు తనతోనే వుందికదా! అందుకే మనస్సు, గతి తప్పి గతంలోకి పరుగెడుతోంది.